భారత వ్యవసాయ విధానం

లక్ష్యాలు.. పరిమితులు.. ప్రభావాలు

18వ శతాబ్దపు పూర్వ భాగంలో మొఘల్ సామ్రాజ్య పతనం భారత దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థల విచ్ఛిన్నానికి దారితీసింది. దీనివల్ల ఆనాటి గ్రామాలు వెనుకబడి ఏకాకిగా, స్వయం జీవనాధారంగా ఉండేవి. 1757 నుంచి 1858 మధ్య ఈస్ట్ ఇండియా కంపెనీ కాలంలో బ్రిటీషర్లు భారతదేశాన్ని వలస రాజ్యంగా మార్చారు. నూతన భూమి శిస్తు విధానం ప్రవేశపెట్టడంతో ...అధిక పన్నులను రైతులపై విధించడం వల్ల గ్రామీణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. 1850 నుంచి 1947 మధ్య వ్యవసాయ రంగంలో వ్యాపార ధోరణి చోటుచేసుకుంది. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఆహార పంటల స్థానంలో అధిక ధరలతో కూడుకున్న వాణిజ్య పంటలపై మక్కువ చూపినందువల్ల ఆహార పంటల విస్తీర్ణం తగ్గి తీవ్ర క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారత వ్యవసాయ రంగం ఒక వెనుకబడిన సంప్రదాయ వ్యవస్థ. స్వాతంత్ర్యానంతరం గడచిన 6 దశాబ్దాల కాలంలో భారత వ్యవసాయ రంగ రూపురేఖలు మారిపోయాయి. గణనీయమైన అభివృద్ధి జరిగింది. అయినా సన్నకారు రైతుల పరిస్థితి మెరుగుపడలేదు. దేశవ్యాప్తంగా వ్యవసాయరంగ వృద్ధి ఒకవిధంగా లేదు. దీనితోపాటు భారతదేశ వ్యవసాయ రంగ పురోగతికి ప్రపంచీకరణ మరొక సవాలుగా పరిణమించింది. 1951లో దేశంలోని మొత్తం జనాభా 361 మిలియన్లు. వీరిలో వ్యవసాయ, అనుబంధ శ్రామికులు 97 మిలియన్లు కాగా 2001లో వీరిసంఖ్య 235 మిలియన్లకు పెరిగింది. 1950-51లో జాతీయాదాయంలో ఈ రంగం 56.4 శాతం వాటాను కలిగి ఉండగా 2006-07లో దీనివాటా 18.5 శాతానికి తగ్గింది. 1901 నుంచి 1971 మధ్యకాలంలో వ్యవసాయ రంగంపై ఆధారపడిన శ్రామిక జనాభా శాతంలో పెద్ద మార్పులేదు. 1901లో మొత్తం శ్రామిక శక్తిలో ఈ రంగంపై ఆధారపడినవారు 71.7 శాతం కాగా, 1951లో 72.1 శాతం, 1971లో 72.1 శాతం, 1991లో 66.8 శాతం, 2001లో 60.8 శాతానికి తగ్గింది.

చిన్న కమతాల వల్ల ఏర్పడే సమస్యల నివారణకు కమతాల సమీకరణ, మార్కెటింగ్, గిడ్డంగి సౌకర్యాల విస్తరణ, సంస్థాపరమైన పరపతి పెంచడం, ప్రోత్సాహకరమైన ధరల విధానం, సహకార రంగాన్ని పటిష్టపరచడం, భూ సంస్కరణల ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడం జాతీయ వ్యవసాయ విధానంలో ముఖ్యాంశాలుగా ఉన్నాయి.

జాతీయ వ్యవసాయ విధాన తీర్మానం- 1993 - లక్ష్యాలు

- వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం నీటిపారుదల, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాల పెంపు
- పశుగణాభివృద్ధి, చేపల పెంపకం, పట్టుపరిశ్రమ, బయోమాస్‌ల అభివృద్ధికి సౌకర్యాలు మెరుగుపరచడం
- వ్యవసాయాభివృద్ధి కోసం జరిగే కృషిలో ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యం ప్రోత్సహించడం
- సహకార వ్యవస్థ పటిష్టపరచడం
- అన్ని విధాలైన వ్యవసాయ కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ లాభదాయకమైన, ఉదాత్తమైందిగా ప్రజలు భావించే విధంగా వ్యవసాయం రంగాన్ని అభివృద్ధి పరచడం

ఈ విధానం అమలుచేసే చర్యలో భాగంగా వ్యవసాయంపై ప్రభుత్వ పెట్టుబడులు, సహకార పరపతి పెంచాలని, భూ సంస్కరణలను సక్రమంగా అమలుచేయడం ద్వారా వ్యవసాయ ప్రగతి సాధించడం, పంటలబీమా అమలు, వర్షాధార భూముల అభివృద్ధి కోసం వాటర్‌షెడ్ కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వడం, ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించే విధంగా మద్దతు ధరలు ప్రకటించడం, వ్యవసాయ రంగంలో మూలధన కల్పన పెంచడం, మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు పెంచడం, వ్యవసాయ ఎగుమతుల పెంపునకు కృషిచేయడం వంటి అంశాలు ప్రతిపాదించారు.

జాతీయ వ్యవసాయ విధానం జూలై 28, 2000

1990వ దశకంలో వ్యవసాయరంగ వృద్ధి క్షీణించినందువల్ల వ్యవసాయాభివృద్ధిని వేగవంతం చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ప్రోత్సహించడం, గ్రామీణ ఉపాధి పెంపు, ఇంతవరకు వినియోగంలో లేని భారతీయ వ్యవసాయరంగ సామర్థ్యాన్ని వెలికితీయడం, ఆహార భద్రత కల్పించడం, సమతతో కూడిన ప్రతిఫలం అందించే విధానాన్ని రూపొందించడం వంటి ప్రధాన లక్ష్యాలుగా సంస్కరణలు అమలుపరచడం కోసం ఈ విధానాన్ని రూపొందించారు.

ఉత్పత్తి రంగానికి సంబంధించి... వ్యవసాయ రంగ వర్తక నిబంధనలు మెరుగుపరచడానికి, ఆగ్రో ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు, ఉద్యానవన ఉత్పత్తులు, వ్యవసాయ అనుబంధాలను ప్రోత్సహించాలని ఈ విధానం ప్రతిపాదించింది. ప్రాంతీయ అసమానతలు తగ్గించే విధంగా ప్రభుత్వరంగ పెట్టుబడులు పెంచాలని, భూమిలేని వ్యవసాయదారులు, నిరుద్యోగ యువకులకు మిగులు భూమి పంపిణీ చేయాలని, కౌలు సంస్కరణలు సక్రమంగా అమలు చేయాలని, రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వడం... ఉత్తర, పశ్చిమ రాష్ట్రాల మాదిరి దేశమంతటా కమతాల సమీకరణ సాధించడం, శక్తి పొదుపు చేసే సాంకేతిక పద్ధతులు, పంటల బీమా పథకం అమలు, బయోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

వ్యవసాయ విధాన లక్ష్యాల సాధన-పరిమితులు

ప్రణాళికా యుగంలో వ్యవసాయ విధానాలు రూపొందించి, వాటి లక్ష్యాల సాధనకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినప్పటికీ ఈ రంగంలో ప్రగతికి అనేక ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి. వ్యవసాయ దారులు పేదవారై, సనాతన ఆలోచన దృక్పథం కలిగిన వారైనందున ఆధునిక పద్ధతులను అవలంభించలేకపోయారు. స్వాతంత్ర్యానికి పూర్వం మొత్తం వ్యవసాయ భూమిలో 18 శాతం భూమికే నీటిపారుదల సదుపాయం ఉంది. స్వాతంత్ర్యానంతరం నీటిపారుదల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాల వల్ల నీటిపారుదల ప్రస్తుతం 40 శాతానికి పెరిగింది. వ్యవసాయదారుల ఆర్థికస్థితి కృత్రిమ నీటి సదుపాయాలు పెంపొందించుకునే విధంగా లేదు. భారతదేశంలో పంటలో 5 శాతం పంట క్రిమి కీటకాలు, తెగుళ్ల వల్ల దెబ్బతింటుందని వ్యవసాయ శాస్త్రవేత్తల అంచనా. వ్యవసాయ దారులకు సస్యరక్షణపై అవగాహన లేకపోవడం దీనికి కారణం. అధిక జనాభా ఈ రంగంపైనే ఆధారపడటం వల్ల కమతాలు విడిపోయి చిన్న కమతాలుగా మారడం వల్ల శాస్త్రీయ వ్యవసాయం సాధ్యపడలేదు. నేషనల్ శాంపుల్ సర్వే అభిప్రాయం ప్రకారం 1961-62లో 2 హెక్టార్లలోపు కమతాలు 52 శాతం ఉండగా ప్రస్తుతం 80 శాతానికి పెరిగాయి. చిన్న కమతాలలో శాస్త్రీయ వ్యవసాయానికి అనుకూలత లేనందువల్ల ఉత్పాదకత తగ్గింది. భూ సంస్కరణల ద్వారా వ్యవ సాయ రంగంలోని లోపభూయిష్టమైన విధానాలను తొలగించి, అఖిల షణీయ విధానాలు ప్రవేశపెట్టే క్రమంలో అనేక చట్టాలు రూపొందించి నప్పటికీ అవి సరైన ఫలితాలు ఇవ్వలేదు. దీంతో వ్యవసాయదారులు ఉత్పాదక శక్తిని పెంపొందించే దిశగా పయనించడం లేదు. వ్యవసాయ దారులు ఇప్పటికీ పరపతి కోసం సంస్థాపరం కాని సదుపాయాలపై ఎక్కువగా ఆధారపడటం వల్ల రుణభారం మరింత పెరిగింది. మరో వైపు సంస్థాపరమైన పరపతి ఆధారాల ద్వారా పంటరుణాలు పొందుతున్న రైతుల సంఖ్య తగ్గడం కూడా వ్యవసాయ విధానాల లక్ష్యాల సాధనకు అవరోధంగా ఉంది. 2004-05లో దేశంలో పంట రుణాలు పొందిన రైతుల సంఖ్య 413 లక్షలు కాగా, 2006-07లో వీరి సంఖ్య 397 లక్షలకు తగ్గింది. మొత్తం రైతుల్లో 26 శాతం మాత్రమే సంస్థాపరమైన పరపతి పొందారు. నూతన వ్యవసాయ పరిజ్ఞానం రైతులను పూర్తిగా మార్కెట్‌పై ఆధారపడే విధంగా తయారు చేసింది. ఉత్పాదితాల సప్లయ్, తమ ఉత్పత్తుల డిమాండ్ కోసం వ్యవసాయ దారులు మార్కెట్‌పై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. భూమి, నీటి వనరుల యాజమాన్య నిర్వహణ సక్రమంగా లేదు. వ్యవసాయ ఉపాధి తగ్గినందువల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగి... ప్రపంచీకరణ నేపథ్యంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే విధంగా వ్యవసాయాభివృద్ధి సాధించడం కష్టతరమైంది. హరితవిప్లవం ప్రభావం చూపిన కొన్ని ప్రాంతాలలో రైతుల ఆదాయాలు పెరిగాయి. నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవడానికి అవసరమైన ఉత్పాదితాల లభ్యత తక్కు వైన ప్రాంతాల్లో ఉత్పత్తి, ఉద్పాదకతలు తగ్గి, ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి. భూమి క్షీణత వల్ల భూమి నాణ్యత లోపించి వ్యవసాయ ఉత్పాదకత తగ్గి, దేశంలో సగ భూభాగం అంటే 329 మిలియన్ హెక్టార్లు క్షీణించినట్లు తెలుస్తోంది. దేశ భూభాగంలో 43 శాతం క్షీణించి ఉత్పాదకతా శక్తిని 33.67 శాతం కోల్పోయినట్లు, 5 శాతం భూభాగం వ్యవసాయ యోగ్యం కాదని గణాంకాలు తెలుపుతు న్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ పెద్ద మార్పు సంభ వించలేదు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వరంగ పెట్టుబడుల తగ్గుదల కూడా వ్యవసాయ విధాన లక్ష్యాల సాధనకు ప్రతికూలంగా ఉంది.

వ్యవసాయ విధానం-ప్రభావాలు

నూతన వ్యవసాయ విధానం ప్రైవేటురంగ భాగస్వామ్యంలో భూమి లీజు ఒప్పందాల ద్వారా కాంట్రాక్ట్ వ్యవసాయం (contract farming) ప్రోత్సహించడానికి ప్రాధాన్యమిచ్చింది. ఈ చర్యవల్ల భవిష్యత్తులో గ్రామీణ ఉపాధి తగ్గే అవకాశాలు ఉన్నాయి. శ్రామిక మిగులు దేశమైన భారత ఆర్థిక వ్యవస్థలో కార్పొరేటు రంగం ప్రవేశించి corporate farming అమలు పరచడం ఎంతవరకు సఫలీకృతం అవుతుందనేది ప్రశ్నార్థకమే! వ్యవసాయ రంగంలో ప్రైవేటు పెట్టుబడులు ప్రోత్సహించడం వ్యవసాయ విధానంలో ఒక ముఖ్య అంశం. గొట్టపు బావుల ఏర్పాటు, వ్యవసాయ పరికరాల విషయంలో ప్రైవేటు పెట్టుబడులు పెద్దరైతులు చేయగలిగినందు వలనే వారు తమ ఉత్పాదకతలు పెంచుకోగలిగారు.

వ్యవసాయంపై ఆధారపడిన వారిలో ఎక్కువశాతం ఉన్న చిన్న రైతులు తమ ఉత్పాదకత పెంపొందించుకోవడానికి పెట్టుబడి పెట్టగ లిగే ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వరంగ పెట్టుబడులపై ఆధారపడ్డారు. తమ వ్యవసాయ సామర్థ్యాన్ని(potential) పూర్తిగా వినియోగించు కోలేని రాష్ట్రాలను గుర్తించడంలో కూడా వ్యవసాయ విధానం విఫల మైంది. వ్యవసాయ రంగ వార్షిక వృద్ధి 4 శాతం సాధించడం అత్యంత అవశ్యకమైనప్పటికీ లక్ష్యాలను పరిమాణాత్మకంగా నిర్ణయించుకోనం దువల్ల వ్యవసాయ విధానం తన లక్ష్యాల సాధనలో విఫలమైంది. హరితవిప్లవం, నీలివిప్లవం, శ్వేతవిప్లవాలు మళ్లీ చోటుచేసుకోవాల్సిన అవశ్యకతను వ్యవసాయ విధానం వివరించింది. పరిస్థితులకను గుణంగా వ్యవసాయ విధానంలో తగిన మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయ విధాన లక్ష్యాల సాధనలో భాగంగా ఉద్యాన పంట లకు సంబంధించి 2005-06లో ఏర్పాటైన జాతీయ ఉద్యాన మిషన్ కింద సహాయం లభిస్తుంది. 11వ ప్రణాళికలో గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతోపాటు ఆహార ధాన్యాల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలనే ఉద్దేశంతో జాతీయ ఆహార భద్రతా మిషన్ ఏర్పాటు చేయడంతోపాటు... వరి, గోధుమ, పప్పుధాన్యాల ఉత్పత్తు లను పెంచడానికి రాష్ట్రాలకు అదనపు కేంద్రసహాయం ఇవ్వాలని నిర్ణయించారు. వ్యవసాయరంగ పురోగతి ద్వారా వ్యవసాయ విధాన లక్ష్యాలు సాధించాలంటే ప్రభుత్వరంగ పెట్టుబడులు పెంచాల్సిన అవశ్యకత ఉంది.

ఇటీవలి కాలంలో కేంద్రప్రభుత్వం తన బడ్జెట్ ద్వారా ప్రకటిస్తున్న పంట రుణాలు ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులకు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. తద్వారా వ్యవసాయ విధాన ముఖ్య లక్ష్యమైన సమానత్వంతో కూడిన వృద్ధి సాధ్యమవుతుంది.

భారత వ్యవసాయ విధానాలు

భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు నేటికీ వ్యవసాయ రంగం ఎంతగానో దోహదం చేస్తోంది. అధిక శాతం ఉద్యోగితను కల్పిస్తూ మెజారిటీ జనాభాకు జీవనోపాధిని అందిస్తోంది ఈ రంగమే. దేశ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయరంగం వాటా 1982-83లో 36.4 శాతం ఉండగా, 2006 - 07 నాటికి 18.5 శాతానికి తగ్గింది. కానీ దేశంలోని 50 మిలియన్ల వర్క్‌ఫోర్స్ ఈ రంగంలోనే ఉన్నారు. అనేక పారిశ్రామిక ఉత్పత్తులకు, ముడిపదార్థాలకు వ్యవసాయ రంగమే మూలం. 1990ల మధ్య భాగం నుంచి పరిశ్రమలు, సేవల రంగంలో వృద్ధిరేటు ఒక్కసారి పెరిగి, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల వృద్ధిరేట్ల మధ్య ఎక్కువ తారతమ్యాలు కనిపించడం (ప్రత్యేకించి 1996-97 నుంచి) ఆర్థికవేత్తలను కలవరపరుస్తోంది. అయితే వ్యవసాయ రంగంలో వార్షిక సగటు వృద్ధి 1950 - 51, 2006-07ల మధ్య 2.5 శాతంగా ఉండగా, జనాభా వార్షిక సగటు వృద్ధి 2.1 శాతంగా ఉంది.

జాతీయ వ్యవసాయ విధానం

కేంద్ర ప్రభుత్వం 2000, జూలై 28న నూతన జాతీయ వ్యవసాయ విధానాన్ని ప్రకటించింది. ఈ పాలసీ ఒక వైపు ప్రధానంగా వ్యవసాయరంగ ఎగుమతుల మీద దృష్టి సారిస్తూ.. మరోవైపు స్వదేశీ అవసరాలను తీర్చే దిశగా వ్యూహరచన చేసింది.

నూతన విధానంలోని ప్రధాన అంశాలు

రాబోయే రెండు దశాబ్దాల్లో వ్యవసాయరంగంలో 4 శాతం వృద్ధి రేటును సాధించడం; భూసంస్కరణల ద్వారా భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ; రాష్ట్రాల్లోని మిగులు భూములెన్నో తేల్చడం; వ్యవసాయ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం; వివిధ పంటలను బీమా గొడుగు కిందకు తీసుకురావడం; బయోటెక్నాలజీని ప్రోత్సహించడం; నూతన వంగడాల సృష్టికి పరిశోధనలు ముమ్మరం చేయడం మొదలైన అంశాలున్నాయి.

నూతన వ్యవసాయ విధానాన్ని 'రెయిన్‌బో విప్లవం' (Rainbow Revolution)గా వర్ణించారు. ఈ రెయిన్‌బోలో ఉన్న వివిధ రంగులు, వివిధ వ్యవసాయ ఉత్పత్తుల వృద్ధికి సంబంధించిన అంశాలతో మిళితమై ఉన్నాయి: గ్రీన్ రెవల్యూషన్ (ఆహార ఉత్పత్తులు); వైట్ రెవల్యూషన్ (మిల్క్ ఉత్పత్తుల వృద్ధి); ఎల్లో రెవల్యూషన్ (ఆయిల్ సీడ్స్ ఉత్పత్తుల వృద్ధి); బ్లూ రెవల్యూషన్ (ఫిషరీస్); రెడ్ (మాంసం/టొమాటో); గోల్డెన్ (ఫ్రూట్స్/యాపిల్); గ్రే (Grey) (ఎరువులు); బ్లాక్/బ్రౌన్ (సం ప్రదాయేతర ఎనర్జీ ఉత్పత్తులు); సిల్వర్ (గుడ్లు ఉత్పత్తి); రౌండ్ (పొటాటో).

ప్రస్తుతం సాధించిన 210 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలను 420 మిలియన్ టన్ను లకు వృద్ధి చెందించడానికి 'ఎవర్ గ్రీన్ రెవల్యూషన్' చేపట్టాలని ప్రస్తుత జాతీయ రైతుల కమిషన్ ఛైర్మన్ ఎం.ఎస్. స్వామినాథన్ పిలుపునిచ్చారు. 11వ ప్రణాళికలో వ్యవసాయరంగం 4 శాతం వార్షిక వృద్ధి సాధించాలని నిర్ణయించారు.

ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO), భారత వ్యవసాయం రంగం

ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయరంగ ఉత్పత్తులు అంతర్జాతీయ వాణిజ్యంలో మరింత పాత్ర వహించాలనే విధానం ప్రభుత్వ భావనగా ఉంది.

ప్రస్తుతం WTOతో జరుపుతున్న చర్చల్లో వ్యవసాయ రంగానికి సంబంధించిన లక్ష్యాలు

- అభివృద్ధి చెందిన దేశాలలోని వ్యవసాయ మార్కెట్లతో సాన్నిహిత్యం (ACCE) సాధిం చడం.
- ఎగుమతి సబ్సిడీలను తొలగించి మార్కెట్ సహిత వివక్ష లేని ట్రేడింగ్ వ్యవస్థను సాధిం చడం.
- అభివృద్ధి చెందుతున్న దేశాల న్యాయబద్ధమైన అంశాలైన ఆహార భద్రత, జీవనోపాధుల పట్ల ప్రపంచ దేశాలు ప్రత్యేక వైఖరి వహించే విధంగా చేయడం మొదలైనవి.

వ్యవసాయదారుల కోసం జాతీయ విధానం (National Policy for farmers 2007)

జాతీయ రైతుల కమిషన్ సిఫార్సుల మేరకు రైతుల కోసం జాతీయ విధానం 2007లో ప్రభుత్వం ప్రకటించింది. దీనిలోని వివిధ అంశాలు:

- ఉత్పత్తి, ఉత్పాదకలతో పాటు రైతుల శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి.
- ప్రతీ రైతుకు సొంత ఆస్తుల సముపార్జనకు, ఉత్పాదక ఆస్తులను ఉపయోగించుకొనే అవకాశం లేదా వారి నైపుణ్యాలను వినియోగించుకొనే సంస్కరణలు తీసుకురావడం.
- నీటిని సమర్థంగా వినియోగించుకునే విధానాల (Water use efficiency) పట్ల రైతులకు అవగాహన కల్పించటం.
- బయో, సమాచార, కమ్యూనికేషన్స్, స్పేస్, నానో వంటి నూతన టెక్నాలజీలను మరింత ప్రోత్సహించి భూమి, నీటి ఉత్పాదకతను పెంచడం.

- జాతీయ వ్యవసాయ బయోసెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేయడం.
- నాణ్యమైన విత్తనాలు అందించటం, భూసార, ఆరోగ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి.
- క్షేత్ర స్థాయిలో రైతుల విజ్ఞానస్థాయిని పెంచి వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు నిర్వహించడానికి గ్యాన్ చౌపల్స్ (Gyan Chaupals)ను ICT (Information and Communication Technology) సహాయంతో ఏర్పాటు చేయడం
- ఇప్పటికే అమలులో ఉన్న వివిధ పంటలకిస్తున్న కనీస మద్ధతు ధరలను మరింత పెంచి, రైతులను మార్కెటింగ్ పరంగా ఆదుకోవడం, స్టోరేజ్/గోదాముల రసీదుల ఆధారంగా బ్యాంకులోన్లను అందించడం.
- అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజన్సీ వ్యవస్థను దేశంలోని అన్ని జిల్లాలకు విస్తరింపజేసి, పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో వ్యవసాయ విస్తరణా కార్యక్రమాలను ముమ్మరం చేయడం.
- రూ. 17 వేల కోట్లతో స్పెషల్ ప్యాకేజీతో ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాలలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరిగిన 31 జిల్లాల్లో నాణ్యమైన విత్తనాల సరఫరా, భూమి - నీరును సురక్షితంగా ఉపయోగించుకోవడం, హార్టీకల్చర్, పశుసంవర్ధక ఉత్పత్తుల పట్ల ప్రత్యేక దృష్టి మొదలైనవి.
- ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ పోషకాహార విలువలను అందించే బాజ్రా, జావర్, రాగి, మిల్లెట్స్ మొదలైనవాటి ఉత్పత్తులను మెట్ట ప్రాంతాలలో అధికం చేయడం.

ప్రాక్టీస్ ప్రశ్నలు..

1) కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (CACP) ఇటీవల ఎన్ని పంటలకు MSP (కనీస మద్ధతు ధర) ప్రకటించింది?
ఎ) 24 బి) 26 సి) 18 డి) 20

2) ఎక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రాం (AIBP) ముఖ్యోద్దేశం?
ఎ) పూర్తిగాని ఇరిగేషన్ పథకాలను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రత్యేక నిధులు అందించడం
బి) కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయడం
సి) డి.పి.ఎ.పి/ ట్రైబల్ ప్రాంతాల్లో 90 శాతం ప్రాజెక్ట్ కాస్ట్‌ను గ్రాంటుగా ఇవ్వడం
డి) ఎ, సి

3) సీడ్ క్రాప్ ఇన్సూరెన్స్ (1999-2000) ప్రధాన ఉద్దేశం?
ఎ) విత్తనాలు పండించే రైతులకు పంట ముందు, తర్వాత ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లితే భర్తీ చేయడం
బి) అనుకున్న దానికన్నా తక్కువ విత్తన దిగుబడులు వచ్చి నష్టం వాటిల్లినపుడు
సి) ఎ, బి డి) ఏదీ కాదు

4) ఆపరేషన్ ఫ్లడ్ (Operation Flood) పథకం కింద భారతదేశం ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉండడానికి కృషి చేసిన వ్యక్తి?
ఎ) డా. వర్గీస్ కురియన్ బి) బోర్‌లాగ్
సి) స్వామినాథన్ డి) ఆర్.కె. వేపా

5) ఎల్లో విప్లవం (Yellow Revolution) ఉద్దేశం?
ఎ) నూనె విత్తనాలు, వంటనూనెల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడం
బి) చేపల ఉత్పత్తుల అభివృద్ధి
సి) పండ్ల ఉత్పత్తులు అధికం చేయడం
డి) ఏదీ కాదు

6) 2007లో ప్రారంభించిన రాష్ట్రీయ కృషీ వికాస యోజన (RKVY) ముఖ్యోద్దేశం?
ఎ) వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను సమష్టిగా అభివృద్ధి చెందించి, వ్యవసాయ రంగంలో 4 శాతం అభివృద్ధి రేటును 11వ ప్రణాళికలో సాధించడం
బి) రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చేవిధంగా చర్యలు తీసుకోవడం
సి) పంటలు విస్తరణ విషయాల్లో స్థానిక అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం
డి) పైవన్నీ

7) జాతీయ ఆహార భద్రతా మిషన్ (NFSM) ధ్యేయం?
ఎ) 11వ ప్రణాళికా అంతానికి ఇప్పటికే ఏర్పర చుకొన్న టార్గెట్ల కంటే వరి, గోధుమ, పప్పు ధాన్యాల్లో 10, 8, 2 మిలియన్ టన్నుల అదనపు ఉత్పత్తులు సాధించడం
బి) అదనపు సాగు విస్తీర్ణం సాధించి ఉత్పా దకత పెంచడం
సి) మంచి నాణ్యమైన అధిక దిగుబడి విత్త నాలు సాధించడం
డి) పైవన్నీ

జవాబులు	1	2	3	4	5	6	7
	A	D	C	A	A	D	D

ఆర్థిక సంస్కరణలు.. వ్యవసాయరంగం



ఆర్థిక సంస్కరణల ప్రక్రియ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. వ్యవసాయరంగ అభివృద్ధికి, పేదరికానికి ముఖ్యంగా గ్రామీణ పేదరికానికి మధ్యగల సంబంధం విస్పష్టం. భారత ఆర్థిక వ్యవస్థ హరితవిప్లవ ప్రయోజనాలను కొంతకాలంగా పొందుతోంది. కానీ హరిత విప్లవం దేశంలోని కొన్ని ప్రాంతాలకు, కొన్ని పంటలకే పరిమితమైంది. హరితవిప్లవాన్ని దేశంలోని మిగతా ప్రాంతాలకు.. ముఖ్యంగా తూర్పు రాష్ట్రాలకు విస్తరించే వేగంపైనే భవిష్యత్తులో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఆధారపడి ఉంది!!

భవిష్యత్తులో బియ్యం, గోధుమలాంటి ఆహార ధాన్యాల కన్నా.. కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, చేపలు, మాంసంలాంటి వాటికి గిరాకీ పెరగవచ్చని డాక్టర్ ఆర్.ఎస్. పరోడా అంచనా. 2030 నాటికి గోధుమ, బియ్యం గిరాకీ 30 శాతానికిపైగా.. మొత్తం ఆహార ధాన్యాలకు గిరాకీ దాదాపు 50 శాతానికి పెరగగలదని అభిప్రాయ పడ్డారు. దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 1980-81లో 129.6 మిలియన్ టన్నులు కాగా 1990-91 నాటికి అది 176.4 మిలియన్ టన్నులకు చేరుకుంది. ఆహారధాన్యాల ఉత్పత్తి వార్షిక వృద్ధి, సంస్కరణల ముందు దశాబ్దంలో 3.1 శాతంగా ఉంది. సంస్కరణల యుగంలో 2003-04 నాటికి 212 మిలియన్ టన్నులకు.. 2006-07లో 217.3 మిలియన్ టన్నులకు ఉత్పత్తి పెరిగినప్పటికీ.. వార్షిక సగటు వృద్ధి 1.4 శాతం మాత్రమే.

వ్యయసాయంపై తగ్గిన పెట్టుబడులు:

సంస్కరణల కాలంలో జనాభా పెరుగుదల రేటు కన్నా.. ఆహారధాన్యాల ఉత్పత్తి తక్కువగా ఉంది. సంస్కరణల యుగంలో తయారీ, సేవల రంగంపై చూపిన శ్రద్ధ వ్యవసాయంపై చూపకపోవడమే ఈ రంగంలో వృద్ధిరేటు తగ్గడానికి కారణమైంది.

గత దశాబ్దంలో వ్యవసాయ వృద్ధిరేటు కేవలం 2 శాతం. అందువల్ల ఈ రంగంలో వృద్ధి స్తంభించిందని చెప్పవచ్చు. ఈ రంగం 9వ ప్రణాళికలో 2.1 శాతం.. 10వ ప్రణాళికలో 2.5 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. మొత్తం స్థూలదేశీయోత్పత్తిలో... వ్యవసాయ రంగంపై పెట్టుబడి 1999- 2000లో 2.2 శాతం. తర్వాత కాలంలో కనీసం ఈ మేరకు కూడా చోటు చేసుకోలేదు. ఇటీవల కాలంలో స్థూలదేశీయోత్పత్తిలో(జీడీపీ) పెట్టుబడులు 32 శాతంగా ఉండగా... వ్యవసాయరంగంపై పెట్టుబడి జీడీపీలో 2 శాతానికే పరిమితమైంది.

రైతుల రుణ మాఫీ:

దేశంలో దాదాపు 60 శాతం ప్రజల జీవనాధారమైన వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గాయి. మరోవైపు ప్రైవేటు రంగంలో గొట్టపు బావులు (ట్యూబ్ వెల్స్), ట్రాక్టర్‌లపై పెట్టుబడులు పెరగడంతో... భూస్వాముల ఆదాయాలు పెరిగి.. గ్రామీణ ప్రాంతాలలో ఆదాయ అసమానతలకు దారితీసింది. దీని ప్రభావం ఉద్యోగితపై కూడా కన్పిస్తోంది. బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలలో నీటిపారుదల వసతుల కల్పనలో ప్రైవేటు పెట్టుబడులు పెద్దగా లేవు. దాంతో ఆ రాష్ట్రాలలో ఆహారధాన్యాల ఉత్పత్తి వృద్ధి జాతీయ సగటుకన్నా తక్కువగా ఉంది.

సబ్సిడీల భారం పెరగడం కూడా వ్యవసాయరంగంలో ప్రభుత్వ రంగ పెట్టుబడులు తగ్గడానికి కారణమైంది. గత మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయరంగ అభివృద్ధికోసం చేపట్టిన అనేక చర్యలు సత్ఫలితాలనిచ్చి వ్యవసాయరంగం అధిక

వృద్ధి నమోదు చేసుకొనే అవకాశాలను మెరుగుపర్చాయి. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో పంట రుణాలను పెంచడం.. రైతుల రుణాల మాఫీ.. వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు పెంచడం.. వంటి చర్యలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం.. వ్యవసాయ ఉత్పాదితాలు తక్కువ ధరకు రైతులకు అందించడం వంటి చర్యలతో... రానున్న రోజుల్లో వ్యవసాయరంగం సంక్షోభం నుంచి బయటపడే అవకాశముంది.

సంస్కరణలు – పారిశ్రామికాభివృద్ధి:

పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అన్ని అడ్డంకులను తొలగించడానికి ఆర్థిక సంస్కరణలు ప్రాధాన్యమిచ్చాయి. సంస్కరణలకు ముందు పారిశ్రామిక లైసెన్సింగ్‌పై ఉన్న ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా తొలగించి లైసెన్సింగ్ విధానాన్ని సరళీకరించారు. ప్రస్తుతం 5 పరిశ్రమలు మాత్రమే లైసెన్స్ పొందాలి. ఎంఆర్‌టీపీ చట్టం పరిధిలోకి వచ్చే సంస్థల ఆస్తులపై ఉన్న రూ. 100 కోట్ల సీలింగ్ పరిమితిని పూర్తిగా రద్దుచేశారు. ప్రభుత్వరంగం తన పాత్రను తగ్గించుకొని 3 పరిశ్రమలకే పరిమితమైంది. సంస్కరణలకు ముందు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు తొలగించి.. ప్రస్తుతం 51 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనుమతిస్తుంది. కొన్ని ముఖ్య రంగాలలో 100 శాతం ఎఫ్‌డీఐలను కూడా అనుమతిస్తూ... పారిశ్రామికరంగ అభివృద్ధి కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. సంస్కరణల ప్రభావం వల్ల కలిగే ప్రయోజనాలు దీర్ఘకాలంలోనే ఎక్కువగా కన్పిస్తాయి. 1981-82 నుంచి 1990-91 మధ్యకాలంలో.. సగటు వార్షిక పారిశ్రామికాభివృద్ధిరేటు 7.8 శాతం. కాగా 1993-94 నుంచి 2004-05 మధ్యకాలంలో.. 6.2 శాతానికి తగ్గింది. తయారీ రంగంలో వృద్ధి 1980లలో 7.6 శాతం. అది 1990లలో 7.2 శాతానికి తగ్గింది. విద్యుత్ రంగం, మైనింగ్, క్వారియింగ్ కూడా సంస్కరణల యుగంలో తక్కువ వృద్ధి కనపరిచాయి. విద్యుత్ రంగం 1980లలో 9 శాతం వృద్ధి నమోదు చేసుకోగా... 1990లలో 5.6 శాతానికి తగ్గింది. ఇదే కాలానికి సంబంధించి మైనింగ్ , క్వారియింగ్ రంగంలో వృద్ధిరేటు 8.3 శాతం నుంచి 4 శాతానికి తగ్గింది. 2006-07లో పారిశ్రామికరంగ వృద్ధి 11.6 శాతానికి చేరుకుంది. తయారీరంగం 12.5 శాతం, విద్యుత్ రంగం 7.2 శాతం, మైనింగ్ రంగం 5.4 శాతం వృద్ధి నమోదు చేసుకున్నాయి. పేపరు, పేపరు సంబంధిత ఉత్పత్తులు 8.7 శాతం వృద్ధి కనపరచగా.. 1,32,000 మిలియన్ టన్నుల మేర పెట్రో కెమికల్ ఉత్పత్తులు జరిగాయి. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ రంగం పెట్టుబడులు తగ్గడం.. ప్రైవేటురంగ పెట్టుబడులు కూడా అనుకున్న స్థాయిలో లేకపోవడం పారిశ్రామికరంగ వృద్ధి తగ్గడానికి కారణం. 10వ ప్రణాళిక చివరి రెండేళ్లు.. 11వ ప్రణాళిక తొలి సంవత్సరంలో మౌలికవసతులపై ప్రభుత్వరంగ పెట్టుబడులు పెరగటం వల్ల పారిశ్రామికాభివృద్ధి కొంత మెరుగైంది. సంస్కరణల ప్రక్రియ విజయవంతం కావడమనేది మూలధన వస్తురంగ ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. ఇటీవల కాలంలో భారీ పారిశ్రామికీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు ద్వారా ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షించి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థల ప్రగతి:

సంస్కరణల ముందుకాలంలో జవాబుదారీతనం లోపించడం.. పర్యవేక్షణ లోపం.. రాజకీయ జోక్యం కారణంగా ప్రభుత్వరంగ సంస్థల ప్రగతి సన్నగిల్లింది. సంస్కరణలలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభించారు. 2004 వరకు పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగింది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతిస్తున్న వామపక్షాలు.. వ్యతిరేకించడంతో పెట్టుబడుల ఉపసంహరణను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. 1993-94 తర్వాత కేంద్రప్రభుత్వరంగ సంస్థలు మంచి ప్రగతి కనపరిచాయి. మార్చి 31, 2007 నాటికి ఈ సంస్థలలో సంచిత పెట్టుబడి రూ. 4,21,089 కోట్లు. మొత్తం పెట్టుబడిలో ఎక్కువ భాగం విద్యుత్, తయారీ రంగం, మైనింగ్, నిర్మాణ రంగంపై ఉన్నాయి. ఈ సంస్థలలో ప్రస్తుతం 16.14 లక్షల మందికి ఉద్యోగిత ఉండగా.. 2006-07లో ఈ సంస్థల నికర లాభం రూ.81,550 కోట్లు.

సంస్కరణలు- శ్రామికులు:

సంస్కరణల యుగంలో పారిశ్రామిక సంబంధాలు మెరుగైనట్లు కనిపిస్తోంది. 1981-90 మధ్యకాలంలో 402.1 మిలియన్ శ్రామిక దినాలు నష్టపోగా (సమ్మెల వల్ల 216.4 మిలియన్ పనిదినాలు, లాకౌట్‌ల వల్ల 185.7 మిలియన్ పనిదినాలు).. 1991-2000 మధ్యకాలంలో నష్టపోయిన పనిదినాల సంఖ్య 230.2 మిలియన్లు. అది 2001-05 మధ్యకాలంలో 134.1 మిలియన్ల శ్రామిక దినాలకు తగ్గింది. నష్టపోయిన పనిదినాల సంఖ్య తగ్గడం.. సంస్కరణల కాలంలో పారిశ్రామిక సంబంధాల మెరుగుదలకు సూచికగా భావించవచ్చు. సంస్కరణల ముందు కాలంలో లాకౌట్స్ వల్ల 46.2 శాతం పనిదినాలు నష్టపోగా.. సంస్కరణల కాలంలో లాకౌట్స్ వల్ల నష్టపోయిన పనిదినాలు.. 1991-2000 మధ్య 60.2 శాతానికి, 2001-05 మధ్యకాలంలో 74.6 శాతానికి పెరిగాయి. సమ్మెల వల్ల నష్టపోయిన పనిదినాలు 1981-90 మధ్యకాలంలో 53.8 శాతం నుంచి 1991-2000 మధ్య 39.8 శాతానికి.. 2001-05 మధ్య 25.4 శాతానికి తగ్గాయి. ప్రైవేటీకరణను ప్రభుత్వం ప్రోత్సహించినప్పటికీ శాశ్వత ఉద్యోగిత కల్పన ఆ రంగంలో జరిగేవిధంగా ప్రభుత్వం తగిన చట్టాలు తీసుకు రావాలి.

అవస్థాపనా పరిశ్రమలు:

సంస్కరణల ముందుకాలం కన్నా సంస్కరణల కాలంలో స్టీల్, సిమెంట్ పరిశ్రమలు మంచి వృద్ధి కనపర్చాయి. విద్యుత్, బొగ్గు, పెట్రోలియం, పెట్రోలియం రిఫైనరీలు సంస్కరణల యుగంలో

ఆశించినంత వృద్ధిని సాధించలేకపోయాయి. 1993-94 నుంచి 2004-05 మధ్య కాలంలో... సిమెంట్ ఉత్పత్తిలో వృద్ధి 7.8 శాతం. కాగా సంస్కరణల ముందు కాలంలో వృద్ధి కేవలం 4 శాతం మాత్రమే. అవస్థాపనారంగ పరిశ్రమల నుంచి ప్రభుత్వం వైదొలగి పెట్టుబడులను పూర్తిగా తగ్గించుకున్నప్పటికీ మరోవైపు ఆ ఖాళీ (గ్యాప్)ని ప్రైవేటురంగం పూరించడంలో విఫలమైంది. ప్రైవేటు రంగంపై అధికంగా ఆధారపడడం కూడా ఈ పరిశ్రమల అభివృద్ధికి అవరోధంగా నిలిచింది. ఇటీవల కాలంలో స్టీల్, సిమెంట్ తయారు చేసే పరిశ్రమలు కార్టెల్‌గా (ఒక గ్రూప్) రూపుదిద్దుకొని... మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలు నిర్ణయించడం వల్ల మిగతా రంగాల అభివృద్ధి కుంటుపడే అవకాశముంది!!